

రేలంగి నరసింహారావును సత్కరిస్తున్న అతిథులు

రేలంగి నరసింహారావుకు దాసరి పురస్కారం


రవీంద్రభారతి, మే 21 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్, ఏఎన్నార్, కృష్ణ, దాసరి నారాయణరావు తెలుగు జాతికి ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు తెచ్చిన మహనీయులని వక్తలు అభివర్ణించారు. మంగళవారం రవీంద్రభారతిలో సీల్‌వెల్ కార్పొరేషన్, శృతిలయ ఫౌండేషన్, శ్రీభారతి మ్యూజిక్ అకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో ఎన్టీఆర్, ఏఎన్నాఆర్, కృష్ణ, దాసరి నారాయణరావుకు స్వరనీరాజనం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ సినీదర్శకుడు రేలంగి నరసింహారావుకు దాసరి నారాయణరావు పురస్కారాన్ని ప్రదానం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ కోలేటి దామోదర్‌గుప్తా హాజరై రేలంగి నరసింహారావును ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సీల్‌వెల్ అధినేత బండారు సుబ్బారావు, సీనియర్ జర్నలిస్టు మహ్మద్ రఫీ, కుసుమ భోగరాజు, రామకృష్ణ, గాయని వేమూరి మంజుల పాల్గొన్నారు. సభకు ముందు ప్రముఖ గాయని ఆమని నేతృత్వంలో నిర్వహించిన సీల్‌వెల్ సుస్వరాలు ప్రేక్షకుల్ని అలరించాయి. చక్కటి గీతాలాపనతో సినీ ప్రముఖులకు స్వరనీరాజనం పలికారు.

కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్ల సర్వీస్‌ను క్రమబద్ధీకరించాలి

బర్కత్‌పుర, మే 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని 11 యూనివర్సిటీల్లో విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్ల సర్వీస్‌ను క్రమబద్ధీకరించాలని యూనివర్సిటీస్ టీచర్స్ అసోసియేషన్(సీ) తెలంగాణ స్టేట్ డిమాండ్ చేసింది. 7వ వేతన సవరణను అమలు చేయాలని కోరింది. మంగళవారం ఏర్పాటుచేసిన సమావేశంలో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఎ.పరుశురామ్, ప్రధానకార్యదర్శులు డాక్టర్ ఢీకొండ తిరుపతి, డాక్టర్ నిరంజన్, వర్కింగ్ ప్రెసిడెంట్లు డాక్టర్ జితేందర్‌రెడ్డి, కరుణాకర్ మాట్లాడారు. రాష్ట్రంలో 1500 మంది కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్లు 25 ఏళ్లుగా విధులు నిర్వహిస్తున్నారని, వారికి జూనియర్ కళాశాల లెక్చరర్ల కంటే తక్కువ వేతనాలు ఇస్తూ వెట్టిచాకిరీ చేయించుకుంటున్నారని వారు ఆరోపించారు. తమ సర్వీస్‌ను క్రమబద్ధీకరిస్తామని కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొందని, సీఎం రేవంత్‌రెడ్డి న్యాయం చేయాలని వారు కోరారు. సమావేశంలో అసోసియేషన్ ఉపాధ్యక్షులు డాక్టర్ భీమయ్య, డాక్టర్ శ్యామ్‌సుందర్, డాక్టర్ రామకృష్ణయ్య పాల్గొన్నారు.

రేపు బుద్ధ జయంతి వేడుకలు

చిలకలగూడ, మే 21 (ఆంధ్రజ్యోతి): మారేడుపల్లి, మహేంద్రహిల్స్‌లోని మహాబోధి బుద్ధవిహార్‌లో గురువారం బుద్ధ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. ఆధ్యాత్మికవేత్త ఆంజనేయరెడ్డి ఆధ్వర్యంలో 2003లో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, బౌద్ధ భిక్షువు దలైలామా మహాబోధి బుద్ధవిహార్‌ను ప్రారంభించారు. మూడంతస్తుల్లో దీనిని నిర్మించారు. లిఫ్ట్, విశాలమైన పార్కింగ్ సౌకర్యాలు ఉన్నాయి. రోజూ ఉదయం 7 నుంచి 11 గంటల వరకు, సాయంత్రం ఐదు నుంచి 8 గంటల వరకు తెరిచి ఉంటుంది. ప్రవేశ రుసుం లేదు. ఇక్కడ ధ్యానం, బుద్ధ ప్రవచనాలు నిర్వహిస్తారు. పర్వదినాలు, పండుగ వేళల్లో ప్రత్యేక పూజలు నిర్వహిస్తుంటారు. దేశ, విదేశాల నుంచి బౌద్ధులు ఇక్కడికి వస్తుంటారు. ధ్యానం చేసుకోవడానికి అన్ని సౌకర్యాలూ ఉన్నాయి.



మహాబోధి బుద్ధవిహార్

వేడుకలకు సీఎం రేవంత్‌రెడ్డి

వేడుకలకు సీఎం రేవంత్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరవుతారని విహార్ ప్రతినిధి చేతన్ తెలిపారు. ప్రత్యేకపూజల్లో పాల్గొంటారని, పుస్తకావిష్కరణకు, సందేశం అందించటానికి అన్నిఏర్పాట్లూ చేశామన్నారు.

స్టెమ్‌సెల్ చికిత్సతో విప్లవాత్మక మార్పులు!

హైదరాబాద్‌సిటీ, మే 21 (ఆంధ్రజ్యోతి): స్టెమ్‌సెల్ చికిత్సతో ఆరోగ్య రంగంలో విప్లవాత్మక మార్పులు వస్తాయని శాస్త్రవేత్త, స్టెమ్‌సెల్స్, ఇమ్యునాలజీ, రీసెర్చ్ మెడిసన్ రచయిత, ఈడబ్ల్యుబీజీ ఫౌండర్ ప్రొఫెసర్ డాక్టర్ మైక్ చాన్ పేర్కొన్నారు. వ్యక్తి ఆరోగ్య పరిస్థితులకు తగినట్లుగా ప్రత్యేక చికిత్స అందిస్తున్నట్టు ఆయన తెలిపారు. యూరోపియన్ వెల్‌నెస్ బయోమెడికల్ గ్రూప్ (ఈడబ్ల్యుబీజీ) మంగళవారం గచ్చిబౌలిలోని ఐఐటీ క్యాంపస్‌లో విద్యార్థులతో చర్చా కార్యక్రమం నిర్వహించింది. ఈ సందర్భంగా చాన్ మాట్లాడుతూ వ్యక్తుల అవసరాలను గుర్తించి అందుకనుగుణంగా చికిత్స అందిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో ఐఐటీ విద్యార్థులు, సినీ నిర్మాత ఏఎం.రత్నం, జనసేన పార్టీ ప్రధానకార్యదర్శి బొలిశెట్టి సత్యనారాయణ, ఈడబ్ల్యుబీజీ భారత్ సైంటిఫిక్ రీసెర్చ్ డైరెక్టర్, సీఈఓ డాక్టర్ రవితేజ అల్లం, సీనియర్ మెడికల్ ఎడ్వైజర్ ప్రొఫెసర్ ఓల్గా నిశాకుమై పాల్గొన్నారు.



చర్చా కార్యక్రమంలో పాల్గొన్న శాస్త్రవేత్త చాన్

రెండో రోజు టెట్‌కు 299 మంది హాజరు

కొత్తపేట, మే 21 (ఆంధ్రజ్యోతి): కొత్తపేట న్యూ నాగోల్‌లోని సీఐఎస్ డిజిటల్ ప్రైవేట్ లిమిటెడ్‌లో రెండో రోజు మంగళవారం టెట్ పరీక్షకు 299 మంది అభ్యర్థులు హాజరయ్యారు. ఉదయం 185 మంది అభ్యర్థులకుగాను 130 మంది హాజరుకాగా, మధ్యాహ్నం 185 మందికిగాను 169 మంది అభ్యర్థులు హాజరయ్యారు. టెట్ పరీక్షకు సోమవారం 49 మంది, మంగళవారం 71 మంది అభ్యర్థులు మొత్తం 120 మంది గైర్హాజరయ్యారు.

రైతాంగ సమస్యలపై ఐక్య పోరాటానికి సిద్ధం కావాలి

రాంనగర్, మే 21 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వాలు అవలంబిస్తున్న రైతాంగ వ్యతిరేక విధానాల వల్ల వ్యవసాయ రంగం సంక్షోభం ఎదుర్కొంటుందని, ఈ నేపథ్యంలో రైతాంగ సమస్యల పరిష్కారానికి ఐక్య పోరాటానికి సిద్ధం కావాలని రైతు సంఘం నాయకులు సారంపల్లి మల్లారెడ్డి, టి.సాగర్ పిలుపునిచ్చారు. మంగళవారం సుందరయ్యవిజ్ఞాన కేంద్రంలో తెలంగాణ రైతు సంఘం విస్తృత రాష్ట్ర కమిటీ సమావేశం సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పోతినేని సుదర్శన్‌రావు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో 2020-21 నుంచి వ్యవసాయ ప్రణాళిక ప్రకటించడం గానీ, ఆన్‌లైన్‌లో పెట్టడం గానీ చేయడం లేదన్నారు. రాష్ట్రంలో ప్రతియేటా 4, 5 లక్షల ఎకరాలలో కల్తీ విత్తనాల వల్ల పంటలు దెబ్బతింటున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. మార్కెటింగ్ శాఖ ద్వారా రైతులకు విత్తనాలు, ఎరువులు, క్రిమిసంహారక మందులు అందించాలని ప్రభుత్వాన్ని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు జూలకంటి రంగారెడ్డి, అరిబండి ప్రసాదరావు, పి.జంగారెడ్డి, బొంతల చంద్రారెడ్డి, వి.వెంకటేశ్వర్లు, మాదినేని రమేష్, ప్రమీల, వెంకటరెడ్డి, సహాయ కార్యదర్శులు శోభన్, బాలకృష్ణ, రాంబాబు, సత్యనారాయణ, బాబు, సత్తిరెడ్డి, వెంకటేష్, బాల్‌రెడ్డి, అశోక్‌రెడ్డి, రాంచందర్, వాసుదేవరెడ్డి, అంజిలయ్య తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రైతు సంఘం నాయకులు సారంపల్లి మల్లారెడ్డి, సాగర్

రాజీవ్‌గాంధీకి నివాళి

ఎల్బీనగర్ నియోజకవర్గంలో మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ వర్ధంతిని మంగళవారం నిర్వహించారు. ఆయన విగ్రహాలు, చిత్రపటాలకు కాంగ్రెస్ పార్టీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎల్‌బీనగర్, ఓల్డ్‌మలక్‌పేట, హయత్‌నగర్, చంపాపేట, సరూర్‌నగర్, వనస్థలిపురం, మీర్‌పేట, జిల్లెలగూడ ప్రాంతాల్లో పలువురు నాయకులు రాజీవ్‌గాంధీ సేవలను కొనియాడారు.



రాజీవ్‌గాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న డీసీసీ ఉపాధ్యక్షులు ఎస్కే రియాజ్ తదితరులు



బడంగ్‌పేట్‌లో రాజీవ్‌గాంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మేయర్ పారిజాతారెడ్డి తదితరులు

ఎల్‌బీనగర్, మే 21 (ఆంధ్రజ్యోతి): మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ వర్ధంతిని మంగళవారం కాంగ్రెస్ పార్టీ సరూర్‌నగర్ డివిజన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. సరూర్‌నగర్ మునిసిపల్ కార్యాలయం వద్ద రాజీవ్‌గాంధీ చిత్రపటానికి కాంగ్రెస్ నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు బోయిని శంకర్‌యాదవ్, సీనియర్ నాయకులు బేర బాలకిషన్, ధనరాజ్‌గౌడ్, రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ఇమ్రాన్ ఖాన్, కార్యదర్శి వీఎస్ఎన్ శ్రీనివాస్‌రావు, గుల్షన్, నయీంఅలీ, శివప్రసాద్, తాండ్ర భాస్కర్, రంజిత్, కిషోర్, ఆసిఫ్, కర్నాటి శ్రీనివాసులు అరుణ, శైలజ పాల్గొన్నారు.

ఓల్డ్ మలక్‌పేటలో..

ఓల్డ్‌మలక్‌పేట: రాజీవ్‌గాంధీ దేశానికి చేసిన సేవలు మరువలేనివని ఓల్డ్‌మలక్‌పేట సీనియర్ కాంగ్రెస్ నాయకుడు కొమిరెల్లి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. ఓల్డ్ మలక్‌పేటలో రాజీవ్‌గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు చౌకి రవికుమార్, రాజేందర్ యాదవ్, మహ్మద్‌గౌస్, నర్సింగ్‌రావు, ప్రకాశ్ బట్టాచార్య, అరవింద్ తదితరులు పాల్గొన్నారు.



మీర్‌పేట్‌లో రాజీవ్‌గాంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే తీగల తదితరులు

తుర్కయంజాల్‌లో..

హయత్‌నగర్: తుర్కయంజాల్ చౌరస్తాలో మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు కొత్తకుర్మ మంగమ్మ ఆధ్వర్యంలో రాజీవ్‌గాంధీ చిత్ర పటానికి పలువురు పూలమాలలువేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ కార్యదర్శి కొత్తకుర్మ శివకుమార్, పీసీసీ సభ్యులు, కౌన్సిలర్ సునీల్, నాయకులు తాడిచెట్టు అశోక్‌గౌడ్, విజయానందరెడ్డి, గోపాల్‌రెడ్డి, సామ భీంరెడ్డి, మధుసూదన్‌రెడ్డి, శేఖర్‌గౌడ్, గుడ్ల అర్జున్, వీరస్వామిగౌడ్, వాసు, శ్యామల పాల్గొన్నారు.

బైరామల్‌గూడలో..

చంపాపేట: చంపాపేట డివిజన్ బైరామల్‌గూడలో డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో రాజీవ్‌గాంధీకి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కర్మన్‌ఘాట్ హనుమాన్ దేవస్థానం చైర్మన్, కాంగ్రెస్ నేత నల్ల రఘుమారెడ్డి, మాజీ కార్పొరేటర్ సామ రమణారెడ్డితో పాటు పలువురు నాయకులు హాజరయ్యారు. అనంతరం రాజీవ్‌గాంధీ విగ్రహానికి పూలమాలలువేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ ప్రచారకమిటీ రాష్ట్ర కో-ఆర్డినేటర్ దుర్గారెడ్డి, నాయకులు కొక్కొండ సూర్యప్రకాష్ గుప్తా, బద్రీనాథ్, రాజశేఖర్‌రెడ్డి, కిరణ్, గడ్డం వెంకటేష్, అనసూయ, సునీల్, యాదగిరి, సురేష్, రాము, జంగయ్యగౌడ్, రవీందర్‌గౌడ్, బాలకృష్ణ పాల్గొన్నారు.



బైరామల్‌గూడలో రాజీవ్‌గాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న హనుమాన్ దేవస్థానం చైర్మన్ రఘుమారెడ్డి, శ్రీపాల్‌రెడ్డి

సాంకేతిక విప్లవానికి ఆద్యుడు రాజీవ్‌గాంధీ

సరూర్‌నగర్: దేశానికి సాంకేతిక పరిజ్ఞానాన్ని పరిచయం చేసి, సాంకేతిక విప్లవానిక రాజీవ్‌గాంధీ ఆద్యుడిగా నిలిచారని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, బడంగ్‌పేట్ మేయర్ చిగిరింత పారిజాతానర్సింహారెడ్డి అన్నారు. రాజీవ్ వర్ధంతిని పురస్కరించుకుని బడంగ్‌పేట్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ సభ్యుడు వై.అమరేందర్‌రెడ్డి, కౌన్సిల్ కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ వంగేటి ప్రభాకర్‌రెడ్డి, కార్పొరేటర్లు బాలూనాయక్, బండారి మనోహర్, జడ్పీటీసీ మాజీ సభ్యుడు బంగారు సత్యనారాయణ, మాజీసర్పంచ్ మర్రి హన్మంత్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాఘవేందర్‌రెడ్డి, కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు బి.గోవర్ధన్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

డీసీసీ కార్యాలయంలో..

జిల్లెలగూడ మంద మల్లమ్మ చౌరస్తాలోని రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో రాజీవ్‌గాంధీ చిత్రపటానికి డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మీర్‌పేట్ కౌన్సిల్ కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ చల్లా కవితాబాల్‌రెడ్డి, కార్పొరేటర్లు సిద్ధాల మౌనికాశ్రీశైలం, బైగల్ల బాలమణి, ఎంపీటీసీ మాజీ సభ్యులు సిద్ధాల దశరథ, నిమ్మల వెంకటేశ్‌గౌడ్, మాజీ సర్పంచ్ పల్లె పాండుగౌడ్, పల్లె జంగయ్య గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

● మీర్‌పేట్ చౌరస్తాలో నిర్వహించిన రాజీవ్ వర్ధంతి కార్యక్రమంలో మహేశ్వరం మాజీఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి హాజరయ్యారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు.

ఎల్‌బీనగర్ చౌరస్తాలో..

వనస్థలిపురం: రాజీవ్‌గాంధీ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు ఎస్కే రియాజ్ అన్నారు. ఎల్‌బీనగర్ చౌరస్తాలో వనస్థలిపురం డివిజన్ కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ అధ్యక్షులు జావేద్ ఆధ్వర్యంలో రాజీవ్‌గాంధీ విగ్రహానికి నివాళి అర్పించారు. కార్యక్రమానికి డీసీసీ ఉపాధ్యక్షులు ఎస్కే రియాజ్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ప్రకాశ్, అభినవ్, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.



తుర్కయంజాల్ చౌరస్తాలో..



జిల్లెలగూడలో రాజీవ్‌గాంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న డీసీసీ అధ్యక్షుడు చల్లా తదితరులు



రాజీవ్‌గాంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఓల్డ్‌మలక్‌పేట కాంగ్రెస్ నాయకులు



రాజీవ్‌గాంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బేర బాలకిషన్, శంకర్ యాదవ్ తదితరులు



బాధితులకు సెల్‌ఫోన్లను అందజేస్తున్న ఏసీపీ కాశిరెడ్డి, ఇన్‌స్పెక్టర్ అశోక్ రెడ్డి

రద్దీ ప్రాంతాల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి: ఏసీపీ

వనస్థలిపురం, మే 21 (ఆంధ్రజ్యోతి): ఇటీవల చోరీలకుగురైన సెల్‌ఫోన్లను వనస్థలిపురం పోలీసులు రికవరీచేసి 31 మంది బాధితులకు అందజేశారు. ఈ సందర్భంగా వనస్థలిపురం ఏసీపీ కాశిరెడ్డి మాట్లాడుతూ రద్దీ ప్రదేశాల్లో సెల్‌ఫోన్ దొంగలు అమాయక ప్రజలను టార్గెట్ చేసుకుని విలువైన సెల్‌ఫోన్లను ఈజీగా దొంగిలిస్తున్నారన్నారు. రద్దీప్రాంతాలకెళ్లే సమయంలో ప్రజలు తమ వస్తువుల పట్ల జాగ్రత్తగా ఉండాలని సూచించారు. సెల్‌ఫోన్ దొంగతనం జరిగిన వెంటనే సమీపంలోని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలన్నారు. చోరీకి గురైన సెల్‌ఫోన్లను రికవరీ చెయడంలో రాచకొండపోలీసులు ముందుంజలో ఉన్నారన్నారు. కార్యక్రమంలో వనస్థలిపురం ఇన్‌స్పెక్టర్ అశోక్‌రెడ్డి, ఎస్సైలు మాధవరెడ్డి, ఏడుకొండలు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

సైదాబాద్, మే 21 (ఆంధ్రజ్యోతి): టీఎస్ఎస్‌పీడీసీఎల్ ఆస్మాన్‌ఘడ్ డివిజన్ పరిధిలోని మరమ్మతుల కారణంగా బుధవారం విద్యుత్‌కోతలు ఉంటాయని డీఈ హన్మంతరెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. 11కేవీ ఎస్వీనగర్‌ఫీడర్ పరిధిలోని పరిసర ప్రాంతాల్లో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు, సిరిపురంకాలనీ ఫీడర్ పరిధిలోని పరిసర ప్రాంతాలలో మధ్యాహ్నం 1 నుంచి 2 గంటల వరకు, ఏటీకాలనీ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని డీఈ తెలిపారు.

నిత్యం పొంగుతున్న డ్రైనేజీ

చంపాపేట, మే 21 (ఆంధ్రజ్యోతి): చంపాపేట డివిజన్ మాధవనగర్‌కాలనీలోని రోడ్ నెం1లో డ్రైనేజీ నిత్యం పొంగుతున్నా ఎవ్వరూ పట్టించుకోవడం లేదని కాలనీవాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జలమండలి అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం దక్కడం లేదన్నారు. గల్పర్‌తో క్లీన్‌చేసిన మూడు రోజులకే మళ్లీ సమస్య ఎదురవుతోందన్నారు. ఈ సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలని కాలనీప్రతినిధులు జలమండలి అధికారులను కోరుతున్నారు.

ఆదిత్యానగర్ రోడ్డును బాగుచేయండి

అదనపు కలెక్టర్‌కు కాలనీవాసుల వినతి

సరూర్‌నగర్, మే 21(ఆంధ్రజ్యోతి): బడంగ్‌పేట్ కార్పొరేషన్ గుర్రంగూడ 7వ డివిజన్‌లోని ఆదిత్యానగర్ కాలనీ రోడ్డును సత్వరమే బాగుచేయాలని, అసంపూర్తిగా వదిలేసిన రోడ్డు అభివృద్ధి పనులను వెంటనే పునఃప్రారంభించాలని కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు పట్టుగల్ల రవీందర్ అధికారులను కోరారు. ఈ మేరకు మంగళవారం ఆయన పలువురు కాలనీవాసులతో కలిసి రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఇటీవల ఈ రోడ్డు దుస్థితిపై.. 'కంకర పరిచి పది నెలలు.. ముందుకు సాగని రోడ్డు నిర్మాణం పనులు' శీర్షికతో 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురితమైన సంగతి విదితమే. కాగా మంగళవారం అధికారులకు సదరు కథనం క్లిప్పింగ్‌ను జత చేసి, వినతి పత్రాన్ని అందజేశారు. సీడీఎంఏ, బడంగ్‌పేట్ కమిషనర్లకు సైతం వేర్వేరుగా వినతి పత్రాలు అందజేశారు. సంబంధిత అధికారులతో మాట్లాడి పనులు తిరిగి ప్రారంభించేలా చర్యలు తీసుకుంటామని అదనపు కలెక్టర్ హామీ ఇచ్చారు.



అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న రవి తదితరులు

ఆలయంలో సెల్ఫ్ టికెటింగ్ మిషన్

చంపాపేట, మే 21 (ఆంధ్రజ్యోతి): చంపాపేట డివిజన్ కర్మన్‌ఘాట్‌లోని శ్రీహనుమాన్ దేవస్థానంలో భక్తుల సౌకర్యార్థం ప్రయోగాత్మకంగా సెల్ఫ్ టికెటింగ్ మిషన్‌ను ఏర్పాటు చేశారు. ఈ మిషన్ ద్వారా భక్తులు నేరుగా అన్నిరకాల స్వామి వారి సేవలతోపాటు ప్రసాదాలను పొందవచ్చని అధికారులు పేర్కొన్నారు.



హనుమాన్ దేవస్థానంలో సెల్ఫ్ టికెటింగ్ మిషన్

భక్తిశ్రద్ధలతో రేణుకాఎల్లమ్మ కల్యాణ మహోత్సవం

కొత్తపేట, మే 21 (ఆంధ్రజ్యోతి): కొత్తపేట సత్యానగర్ సమీపంలోని గ్రామదేవత గవ్వల రేణుకా ఎల్లమ్మ ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం భక్తిశ్రద్ధలతో అమ్మవారి కల్యాణమహోత్సవాన్ని నిర్వహించారు. ఈ ప్రత్యేక పూజల్లో కార్పొరేటర్ పవన్‌కుమార్, ఆలయ చైర్మన్ కట్ట వెంకటేశంస్వామి, మంచి రాజేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.


ఆలయంలో హుండీ పగులగొట్టి చోరీ

సైదాబాద్, మే 21 (ఆంధ్రజ్యోతి): మాదన్నపేట బోయబస్తీలోని వీరాంజనేయస్వామి ఆలయంలో సోమవారం మధ్యాహ్నం చోరీ జరిగింది. గుర్తు తెలియని వ్యక్తులు ఆలయంలోని హుండీ తాళం పగులగొట్టి అందులోని డబ్బులు, కానుకలను తస్కరించారు. సోమవారం సాయంత్రం దేవాలయం శుభ్రం చేసేందుకు పనిమనిషి వెళ్లగా హుండీ తాళం పగలగొట్టి ఉండడంతో చోరీ జరిగినట్లు గుర్తించి ఆలయ కమిటీ సభ్యులకు తెలియజేసింది. ఈ మేరకు మాదన్నపేట పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు దర్యాప్తు చేస్తున్నారు.

తహసీల్దార్ కార్యాలయం తరలింపుపై ఆగ్రహం

పాత ఆఫీస్ ఎదుట అఖిలపక్ష నేతల నిరసన

సరూర్‌నగర్, మే 21 (ఆంధ్రజ్యోతి): బాలాపూర్ మండల తహసీల్దార్ కార్యాలయం తరలింపుపై అదే గ్రామానికి చెందిన అఖిలపక్ష నేతలు ఆందోళన చేశారు. తమ గ్రామం పేరుతో ఏర్పాటైన కార్యాలయాన్ని మరో గ్రామానికి తరలించడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. ఈ మేరకు మంగళవారం నల్లబ్యాడ్జీలు ధరించి బాలాపూర్‌లోని తహసీల్దార్ పాతకార్యాలయం ఎదుట నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తహసీల్దార్ కార్యాలయాన్ని తిరిగి బాలాపూర్‌లోనే ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యాలయం తిరిగి బాలాపూర్‌కు వచ్చేదాకా దశలవారీగా ఆందోళన కార్యక్రమాలను నిర్వహిస్తామని వారు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ, బీఆర్ఎస్, కాంగ్రెస్, ఎంఆర్‌పీఎస్‌కు చెందిన నాయకులు కొలన్ శంకర్‌రెడ్డి, గడ్డం వెంకటేష్, బొర్ర రవిమాదిగ, వంగేటి లక్ష్మారెడ్డి, గుండె నాగార్జున, రఘునందన్‌చారి, బాల్‌రాజ్, పోరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, తిమ్మని గిరీశ్, చిగిరింత పెద్ద నర్సింహారెడ్డి, దొడ్డి శ్రీశైలం, అత్తాపురం శ్రీనివాస్‌రెడ్డి, జోరల ప్రభాకర్ పాల్గొన్నారు.



తహసీల్దార్ పాత కార్యాలయం ఎదుట నిరసన ప్రదర్శన నిర్వహిస్తున్న అఖిలపక్ష నేతలు



మాదన్నపేట పాఠశాలలో పరిశీలిస్తున్న కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

అమ్మ ఆదర్శ పాఠశాలల్లో పనులను పూర్తి చేయాలి

హైదరాబాద్ సిటీ, మే 21 (ఆంధ్రజ్యోతి): అమ్మ ఆదర్శ పాఠశాలల్లో చేపట్టిన పనులను త్వరగా పూర్తిచేయాలని హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అధికారులను ఆదేశించారు. మంగళవారం జిల్లాలోని సైఫాబాద్‌లోని మాదన్నపేట ఎరుకలబస్తీ ఉన్నత పాఠశాలను సందర్శించి, అక్కడ చేపట్టిన పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు మౌలికసౌకర్యాలు కల్పించి ప్రైవేట్ విద్యాసంస్థల కంటే మెరుగ్గా తీర్చిదిద్దుతామని చెప్పారు. పాఠశాలల్లో పార్కింగ్‌ను మంచి టైల్స్‌తో ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం మలక్‌పేట్‌లోని ప్రభుత్వ అంధుల బాలికల ఉన్నత పాఠశాల పనులను పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో డీఈఓ రోహిణి, టీజీఈడబ్ల్యూఐడీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ షఫీమియా, ప్రధానోపాధ్యాయులు ఆర్.లక్ష్మి, అంజిరెడ్డి, అస్రాఫాతిమా, రాజిరెడ్డి, ఆదర్శ పాఠశాలల కమిటీ సభ్యులు, కాంట్రాక్టర్ తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల మధ్యలో సీసల గోదాంను తొలగించాలి

అబ్దుల్లాపూర్‌మెట్, మే 21 (ఆంధ్రజ్యోతి): ఎలాంటి అనుమతులూ లేకుండా అక్రమంగా ఇళ్ల మధ్యలో ఏర్పాటు చేసిన సీసల గోదాం(సీసల రీసైక్లింగ్)ను అక్కడి నుంచి తొలగించాలని కాలనీవాసులు డిమాండ్ చేస్తున్నారు. పెద్ద అంబర్‌పేట్ మున్సిపాలిటీ కుంట్లూర్ 24వ వార్డు పరిధిలోని వెంకటేశ్వరకాలనీలో కొందరు ఇటీవల సీసలగోదాంను ఏర్పాటు చేశారు. రోజూ అక్కడికి పలు వాహనాల్లో పాతసీసాలను తీసుకొస్తుండడం, వాసన వస్తుండడంతో కాలనీవాసులు తీవ్రఇబ్బంది పడుతున్నట్లు తెలిపారు. విషయాన్ని మున్సిపల్ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వెంటనే కమిషనర్ చర్యలు తీసుకోవాలని లేనికేంటే కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని అన్నారు.

● పేదింటి యువతి వివాహానికి పుస్తె మట్టెల అందజేత



అబ్దుల్లాపూర్‌మెట్ జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీకి చెందిన ఓ పేదింటి యువతి పెళ్లికి సురక్ష సేవా సంఘం విరాళాల ద్వారా సేకరించిన డబ్బుతో మంగళవారం పుస్తె మట్టెలను అందించారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గోపీశంకర్‌యాదవ్‌తో పాటు సంఘం సభ్యులు పాల్గొన్నారు.

- అబ్దుల్లాపూర్‌మెట్, (ఆంధ్రజ్యోతి)

గుర్తు తెలియని యాచకుడి మృతి

అబ్దుల్లాపూర్‌మెట్, మే 21 (ఆంధ్రజ్యోతి): గుర్తు తెలియని యాచకుడు మృతి చెందిన సంఘటన అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి..అబ్దుల్లాపూర్‌మెట్ సమీపంలో బ్రిలియంట్ కళాశాల కమాన్ దగ్గర విజయవాడ జాతీయ రహదారి సర్వీసు రోడ్డులో 70 ఏళ్ల వయస్సున్న గుర్తు తెలియని యాచకుడు మృతి చెందినట్లు డయల్ 100 ద్వారా అబ్దుల్లాపూర్‌మెట్ పోలీసులకు సమాచారం వచ్చింది. వెంటనే అక్కడికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. ఈమేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



యాచకుడి మృతదేహం